
APTEL/25/A2326

# ప్రజలకి చేరువ

సామాన్యుడి ఆయుధం




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్   మంగళవారం   07-04-2026   సంపుటి : 1   సంచిక : 206   ఎడిటర్ : కుమార్   పేజీలు : 4   వెల రు : 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar



# శత్రు భూభాగం నుంచి పైలట్‌ను రక్షించడం..

## అంత సులువు కాదు!

'లీవ్ నో మ్యాన్ బిహైండ్'..! ప్రపంచవ్యాప్తంగా ప్రొఫెషనల్ సైన్యాలు పాటించే సూత్రమిది. యుద్ధరంగంలో గాయపడి, నిస్సహాయుడిగా ఉన్న సహచర సైనికుడిని వదిలేయకూడదన్నది దీని సారాంశం. అతడిని రక్షించడానికి అన్ని ప్రయత్నాలూ చేయాలి. శత్రు గగనతలంలోకి చొచ్చుకెళ్లి, దాడులు చేసే యుద్ధవిమాన పైలట్లకు ప్రమాదం ఎక్కువ! తమ ఫైటర్ జెట్‌లో సాంకేతిక లోపం వల్ల కానీ ప్రత్యర్థి క్షిపణి దాడి వల్ల కానీ వారు శత్రు భూభాగంలో దిగాల్సి ఉంటుంది. వీరిని రక్షించి, వెనక్కి తీసుకురావడం చాలా సంక్లిష్టం. ఇరాన్ భూభాగంలో ఇదేరీతిలో చిక్కుకుపోయిన తమ పైలట్‌ను కాపాడటానికి అమెరికా సర్వశక్తులొడ్డుతోంది. శత్రు భూభాగంలో చిక్కుకుపోయిన పైలట్‌ను రక్షించడానికి అమెరికా మిలటరీ.. కంబాట్ సెర్చ్ అండ్ రెస్క్యూ(సీఎస్ఏఆర్) అనే ప్రత్యేక వ్యవస్థను ఉపయోగిస్తుంది. ఇందులో అత్యంత సమన్వయంతో కూడిన భూతల, గగనతల యంత్రాంగాలు ఉంటాయి. పైలట్లను రక్షించడానికి అమెరికా రక్షణశాఖ ఐదు దశలను పాటిస్తోంది.



# 28న గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

అమరావతి: విశాఖలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ఏప్రిల్ 28న శంకుస్థాపన చేయనున్నారు. 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో దీన్ని నెలకొల్పనున్నారు. ఈ నెల 28న పనులు అధికారికంగా ప్రారంభమవుతాయి. కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ పాల్గొంటారు. డేటా సెంటర్‌కు విశాఖ సమీపంలో మూడు చోట్ల 601.4 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. జులై 2028 నాటికి ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.




# వారికి మావిగన్ పిచ్చి ముదిరింది

- నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలని సీఎం చంద్రబాబు కోరారు. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు. - 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశమయ్యారు.-"వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం.- ఎన్టీఆర్ జలసిరి, నీరు-మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం.




రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు.. అదే సంపద సృష్టిస్తుంది" అని చంద్రబాబు అన్నారు.మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైకాపాపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. "రాష్ట్రంపై పగబట్టారు.. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని.. పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని.. అది అమరావతి" అని సీఎం స్పష్టం చేశారు.

# నాదర్‌గుల్ భూములు..

## రేవంత్ అధికారంలోకి వచ్చాకే కబ్జాలు: హరీశ్‌రావు

- **భారీ కుంభకోణం: నాదర్‌గుల్ భూముల స్కామ్ విలువ సుమారు ?7,000 కోట్లు ఉంటుందని హరీశ్‌రావు అంచనా వేశారు.**
- **దళితుల భూముల కబ్జా: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దళితుల భూములను గద్దల్లా తన్నుకుపోతున్నారని, ఇందులో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు.**

హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దళితుల భూములను గద్దల్లా తన్నుకుపోతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్ భూముల స్కామ్‌లో ప్రభుత్వ పెద్దలు భాగస్వాములుగా ఉన్నారని ఆరోపించారు. ఈ భూ కుంభకోణం విలువ సుమారు రూ.7 వేల కోట్లు ఉంటుందని చెప్పారు. పేజి 2లో ▶



## పెన్నానదిలో స్నానానికి దిగి

# ఒకరి మృతి..



కడప: వైఎస్సార్ కడప జిల్లా వల్లూరు మండలం పుష్పగిరి వద్ద పెన్నా నదిలో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. దీంతో పోలీసులు వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టగా.. ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో ఇద్దరి ఆచూకీ కోసం వెతుకుతున్నారు. ముగ్గురు యువకులను కడపకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

# నకిలీ బాబా- శిందే మధ్య ఫోన్ కాల్స్..

## సీడీఆర్ లీక్‌పై వివాదం



తాంత్రిక పూజల పేరుతో పలువురు మహిళలపై అత్యాచారాలు జరిపిన కేసు లో నాసిక్ నకిలీ బాబా అశోక్ ఖరాత్ అరెస్టైన విషయం తెలిసిందే. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే తో ఆయన పలుమార్లు ఫోన్‌లో మాట్లాడిన సీడీఆర్ రికార్డులు ఇటీవల బయటకు రావడంతో మహారాష్ట్ర రాజకీయాల్లో గందరగోళం నెలకొంది. గుర్తు తెలియని వాట్సప్ నెంబర్ నుంచి ఈ రికార్డింగ్స్ షేర్ చేసినట్లు సామాజిక కార్యకర్త అంజలీ దమానియా శు క్రవారం వెల్లడించడంతో ఈ విషయం బయటకు వచ్చింది.

## క్షమాపణలు చెప్పినా.. ఆయన్ను వదిలిపెట్టం: రాహుల్ గాంధీ



- **అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ క్షమాపణలు కోరినా.. ఆయన్ను వదిలిపెట్టబోమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.**

## శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల కోరిక గ్రీన్‌ఫీల్డ్ పోర్టుతో సాకారం



శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల కోరిక మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుతో తీరనుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మూలపేట పోర్టు నిర్మాణ పనులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిపై అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ ఏడాది చివరి నాటికి పోర్టును పూర్తి చేయాలని నిర్మాణ సంస్థల్ని ఆదేశించారు. గత వైకాపా పాలనలో మూలపేట పోర్టులో కొన్ని పనులు ప్రారంభం కాలేదని అన్నారు.

# సంపాదకీయం

## మావిగన్.. మారీచ!

'ఊరందరిదీ ఒక దారి అయితే ఉలిపి కట్టెది మరో దారి' అని అంటారు. అమరావతిని మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా నిర్ణయిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాజకీయ పార్టీలూ ఏకాభిప్రాయంతో ఆమోదించగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రతిపక్ష పార్టీ వైసీపీ మాత్రం వ్యతిరేకించడం ఈ సామెతను గుర్తుచేస్తున్నది. రాష్ట్రం ఏర్పడిన 12 ఏళ్ల తర్వాత మా రాజధాని ఇది అని అధికారికంగా చెప్పుకోవలసి రావడమే దౌర్భాగ్యం అనుకుంటే సదరు బిల్లును కూడా వ్యతిరేకించడాన్ని ఏమనుకోవాలి? పిచ్చికి మందు ఉంటుంది గానీ అసూయ, ద్వేషాలకు మందు ఉండదు. రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందుతున్న సమయంలోనే తాను మళ్లీ అధికారంలోకి వస్తే రాజధానిని మారుస్తానని ప్రకటించడంతో పాటు మచిలీపట్నం --విజయవాడ--గుంటూరును కలిపి 'మావిగన్' పేరిట రాజధానిని ఏర్పాటు చేసుకోవచ్చునని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనతో రాష్ట్ర ప్రజలే కాకుండా వైసీపీ నాయకులు కూడా నిర్ఘాంతపోయారు. అమరావతి అనే పేరు ఉచ్చరించడానికి కూడా జగన్‌రెడ్డి ఎందుకు ఇష్టపడటం లేదో తెలియదు. అమరావతిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి రెండు లక్షల కోట్ల రూపాయలు అవసరమని, అంత డబ్బును ఒకేచోట ఖర్చు చేస్తే మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని ఆయన పాత పాటనే అందుకున్నారు. అమరావతి నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదు. రైతులు ఉదారంగా ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బుతోనే మౌలిక సదుపాయాలు, నిర్మాణాలు చేపడుతున్నారు. అమరావతి అనేది సెల్ఫ్ సస్టెయినబుల్ ప్రాజెక్టు అని తెలిసి కూడా గతంలో చేసిన దుష్ప్రచారాన్ని జగన్‌రెడ్డి మళ్లీ మొదలుపెట్టారు. ఇలాంటి అసంబద్ధ ఆలోచనలు, నిర్ణయాలు, చర్యల వల్ల గత ఎన్నికల్లో చావుదెబ్బ తిన్నప్పటికీ తమ నాయకుడి వైఖరిలో మార్పు రాకపోవడాన్ని వైసీపీకి, జగన్‌కు మద్దతుగా నిలుస్తున్న బుద్ధిజీవులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో జరిగిందేదో జరిగిపోయింది, ఇకనైనా రాజధాని గురించి మాట్లాడకపోవడం మంచిది అని పలువురు సలహాలు కూడా ఇస్తున్నారు. అయినా ఇవేవీ పట్టని జగన్‌రెడ్డి ఇప్పుడు మూడు రాజధానులను పక్కనపెట్టి 'మావిగన్' అనే కొత్త పేరును తెరపైకి తెచ్చారు. ఈ పేరు చెబుతున్నప్పుడు ఆయన స్వరంలో అంతులేని వెటకారం ధ్వనించింది. అమరావతి విషయంలో జగన్‌రెడ్డి వైఖరి వెల్లడి అయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు అదృష్టవంతుడు అని మరోమారు రుజువైంది. జగన్‌రెడ్డి వంటి వ్యక్తి రాజకీయ ప్రత్యర్థిగా ఉండటాన్ని మించిన అదృష్టం ఏముంటుంది? 2024 ఎన్నికల్లో చంద్రబాబు బంపర్ మెజారిటీతో అధికారంలోకి రావడానికి కారణం ఏమిటి? తెలుగుదేశం--జనసేన--బీజేపీ ఒక కూటమిగా ఏర్పడటమా? లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రా? చంద్రబాబు జైలుకు వెళ్లడమా? లేక చంద్రబాబు రాజకీయ వ్యూహాలా?

ఇవేవీ కావు-- అప్పుడు ముఖ్యమంత్రిగా ఉండిన జగన్మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ముఖ్యమంత్రి ఎలా వ్యవహరించకూడదో అలా వ్యవహరిస్తూ అరాచకాలను పెంచి పోషించడం ద్వారా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. 2019కి పూర్వం జగన్‌రెడ్డి ఎలాంటి వారో, ఆయన నైజం ఎటువంటిదో ప్రజలకు తెలియదు. దివంగత రాజశేఖరరెడ్డి కుమారుడిగా ఆయనను అభిమానించారు. జగన్‌రెడ్డిలో రాజశేఖరరెడ్డిని చూసుకున్నారు. ఈ కారణంగానే 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్‌రెడ్డికి కట్టబెట్టారు. ఇక అప్పటి నుంచి జగన్‌రెడ్డి నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధపడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూయా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు తత్వం బోధపడింది. ఫలితమే బంపర్ మెజారిటీతో కూటమి అధికారంలోకి వచ్చింది. సరే జరిగిపోయిందేదో జరిగిపోయింది అని ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీలు ఆత్మపరిశీలనకు ఉపక్రమిస్తాయి. తప్పు ఎక్కడ జరిగిందో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటాయి. సదరు పొరపాటు మళ్లీ జరగబోదని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తాయి. జగన్‌రెడ్డి ఈ ప్రాథమిక సూత్రాన్ని కూడా పట్టించుకోవడం లేదు. రాజకీయాల్లో అయినా, మరెందులో అయినా వైఫల్యాలను గుణపాఠాలుగా మలచుకొని ఎదగడానికి ప్రయత్నించడం సహజం. అయితే తాను అనుకున్నదే నిజమని నమ్మే జగన్‌రెడ్డి మరో అభిప్రాయం వినడానికే ఇష్టపడరు. ఈ క్రమంలో హైహై నాయకా అనే భజనపరులే ఆయన చుట్టూ ఏర్పడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత ఆయన దృష్టికి వెళ్లకుండా పరదాలు కప్పారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ప్రజల్లో జగన్‌కు మద్దతు పెరిగిందని నమ్మబలికారు. 2019లో దాదాపు యాభై శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ బలం 55 శాతం దాటిందని తాము భ్రమించడమే కాకుండా జగన్‌రెడ్డిలోనూ భ్రమలు కల్పించారు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని కాకి లెక్కలు వేసుకున్నారు. ఈ భజన బృందం మాటలు నమ్మిన జగన్‌రెడ్డి 'వై నాట్ 175' అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత డామిట్ కథ అడ్డం తిరిగింది అని తెలిసి కూడా నెపాన్ని ఈవీఎంలపై తోసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తోంది. ఇంకేముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, మూడేళ్లు కళ్లు మూసుకుంటే జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారని చిడతలు కొట్టడం మొదలెట్టారు. జగన్ పర్యటనల సందర్భంగా కృత్రిమ హడావిడికి రూపకల్పన చేస్తున్నారు. ఎన్నికల్లో తమను ప్రజలు ఎందుకు తిరస్కరించారో తెలుసుకొనే ప్రయత్నం చేయకపోగా తాము మళ్లీ అధికారంలోకి వస్తే తమ పాలన మరింత భయానకంగా ఉంటుందని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం మొదలెట్టారు.

అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలను ప్రజలు మరచిపోకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. రప్పా రప్పా అంటూ కత్తులు, గొడ్డళ్లు చేపట్టి స్వైరవిహారం చేస్తున్నారు. ఈ చర్యలేవీ 2029లో అధికారంలోకి రావడానికి ఉపయోగపడవని తెలుసుకొనే ప్రయత్నం చేయడంలేదు. తద్వారా 2029లో కూడా మళ్లీ ప్రతిపక్షంలోనే కొనసాగడానికి దారులు వేసుకుంటున్నారు. జగన్‌రెడ్డి పందిని చూపి నంది అంటే అదే నిజమని, నందిని చూపి పంది అంటే కూడా అది నిజమని నమ్మేవాళ్లు వైసీపీలో పుష్కలంగా ఉన్నారు. ఆ పార్టీలో సొంత బుర్ర వాడుతున్న వాళ్ల సంఖ్య తగ్గిపోతోంది. వైసీపీ నాయకులకు తోడుగా పేటీఎం బ్యాచ్ ఉండనే ఉంది. జగన్‌రెడ్డి తాడేపల్లిలో ప్యాలెస్ కట్టుకుంటే అదే రాజధాని అని ప్రచారం చేశారు. ఛ ఛ అదేమీ కాదు.. మూడు రాజధానులు అంటే ఎగిరి గంతేశారు. ఇప్పుడు అది కూడా కాదు 'మావిగన్' అంటే ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. మెడకాయ మీద తలకాయ-- ఆ తలకాయలో ఇంత గుజ్జు ఉన్న ఎవరైనా 'మావిగన్' అని జగన్‌రెడ్డి నోటివెంట వెలువడిన వికారాన్ని ఏవగించుకుంటారు. ఈ 'మావిగన్' ప్రతిపాదన తర్వాత ఇటీవలి కాలంలో ఎప్పుడూ చూడనంతగా జగన్‌రెడ్డిపై ట్రోలింగ్ జరగడాన్ని చూస్తున్నాం. జగన్ అండ్ కోను పిచ్చివాళ్ల సమూహంగా సోషల్ మీడియాలో చిత్రిస్తూ ట్రోలింగ్ జరిగింది. జగన్‌రెడ్డి రోత మీడియా సంగతి చెప్పే పనేలేదు. అందరి నోటా 'మావిగన్' మాటే అంటూ ఆత్మవంచనకు పాల్పడ్డారు. ఈ ఆలోచనే మేలు అని మేధావులు, ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారని నమ్మబలికించే ప్రయత్నం చేస్తున్నారు. మహా నగరాలతో 'మావిగన్' పోటీ పడుతుందని ప్రచారం కూడా మొదలెట్టారు. పార్టీ అధినేతలు నోరు జారినా, ఆచరణ సాధ్యం కాని ప్రతిపాదనలు వారి నోటి వెంట వెలువడినా అదెలా సాధ్యమని వారించిన నాయకులను, సలహాదారులను ఎందరినో చూశాం. ఒక్క జగన్‌రెడ్డి విషయంలోనే ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. తనతో విభేదించే వారిని జగన్‌రెడ్డి ఇష్టపడరేమో తెలియదు. లేదా సొంత బుర్రతో ఆలోచించడాన్ని ఆ పార్టీ నేతలు మరచిపోయారేమో తెలియదు. బుద్ధి, జ్ఞానం ఏ మాత్రం ఉన్నా రాజధాని విషయంలో తలదూర్చడం ఎందుకు అని సలహా ఇవ్వాలి. అలా కాకుండా

# నకిలీ బాబా- శిందే మధ్య ఫోన్ కాల్స్..

మొదటిపేజీ తరువాయి

ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ..అశోక్ ఖరాత్ కేసుపై దర్యాప్తు జరుగుతున్న సమయంలో ఆడియోలు బయటకు ఎలా లీక్ అయ్యాయనే విషయంపై ఈడీ (జుణ)తో దర్యాప్తు జరిపిస్తామన్నారు. ఒకరి కాల్ డేటా రికార్డులను పొందే హక్కు మరొకరికి ఉండదని అన్నారు. ఈ డేటా ఎలా, ఎవరి ద్వారా లీక్ అయ్యిందో తెలుసుకుంటామన్నారు. అశోక్ ఖరాత్ అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఇప్పటికే తమ దృష్టికి వచ్చిందన్నారు. మరో వైపు ఉప ముఖ్యమంత్రి శిందేపై చేస్తున్న తప్పుడు ప్రచారాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ) డిమాండ్ చేసింది.

# క్షమాపణలు చెప్పినా.. ఆయన్ను వదిలిపెట్టం: రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి

అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ క్షమాపణలు కోరినా.. ఆయన్ను వదిలిపెట్టబోమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అస్సాంలోని బిశ్వనాథ్ చరియాలీలో నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా అభివర్ణించారు.

"అస్సాంకు చెందిన దివంగత గాయకుడు జుబిన్ గార్గ్.. రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదు. మా పార్టీ భావజాలం కూడా అలాంటిదే. ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే మా సిద్ధాంతం. మేం అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో నిందితులను 100 రోజుల్లోగా శిక్షిస్తాం" అని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక వర్గాలకు ఎస్టీ హోదా ఇస్తామని, తేయాకు కూలీలకు రోజుకు రూ.450 చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హిమంత నేతృత్వంలోని భాజపా సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని భాజపా ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా.. ఆయనపై చర్యలు తప్పవని చెప్పారు.

# క్రీడల్లో తెలంగాణను

## దేశానికే ఆదర్శంగా నిలుపుతాం

తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలపాలని నిర్ణయించుకున్నాం. అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. వివిధ క్రీడల్లోని ప్రముఖులను ఇందులో భాగస్వాములను చేశాం. తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్లు ఇచ్చి ప్రోత్సహించాం. క్రికెటర్ సిరాజ్‌కు రూ.కోటి, ఇంటి స్థలం ఇచ్చి సత్కరించాం.. డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. క్రీడల్లో రాణించాల్సిన యువత మత్తుబారిన పడటం బాధాకరం. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో యువత డ్రగ్స్ బారినపడి జీవితాలు నాశనం చేసుకున్నారు. ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో కూడా డ్రగ్స్ కల్చర్ పెరిగింది. హైదరాబాద్ పోలీసులు సైబర్ నేరాలు, డ్రగ్స్ కట్టడిలో ముందున్నారు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# బీఆర్ఎస్ లోకి వెళ్లే ప్రసక్తే లేదు..

మొదటిపేజీ తరువాయి

శామీర్‌పేట: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. శామీర్‌పేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఎలాంటి తప్పు చేయకున్నా మెడలు పట్టి బయటకు గెంటేసిన బీఆర్ఎస్ పార్టీలోకి మళ్లీ వెళ్తున్నానని పిచ్చి ప్రచారాలు చేస్తున్న వారికి చెబుతున్నా.. పార్టీలు మారే పరిస్థితి లేదు. పార్టీలు మారడం దుస్తులు మార్చినంత సులభం కాదు.

నన్ను ఎన్నో అవమానాలకు గురి చేస్తూ రాత్రికి రాత్రే బీఆర్ఎస్ నుంచి బర్తరఫ్ చేశారు. అధికార బలంతో వ్యక్తిగతంగానూ తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. ఇప్పుడేమో ఈటల పార్టీ మారుతున్నారని కరీంనగర్‌లో కొందరు పోస్టర్లు వేయడం.. ఆరోపణలు చేయడం నన్ను బాధించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీలు మారే పరిస్థితి రాదు" అని పేర్కొన్నారు.

## ఫేస్‌బుక్ పరిచయం.. రూ.2.36 కోట్ల మోసం



హైదరాబాద్: ఫేస్‌బుక్‌లో మహిళ పేరుతో పరిచయమైన గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి ఓ వ్యక్తి రూ.2.36 కోట్లు పోగొట్టుకున్నాడు. 'ఫేస్‌బుక్ స్టోర్'లో కొనుగోలు, అమ్మకాలతో లాభాలు వస్తాయన్న బూటకపు మాటలతో మూడున్నర నెలల వ్యవధిలో ఈ డబ్బు బదిలీ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ ప్రాంతంలో నివసించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వీరభద్రరావుకు గతేడాది ఆగస్టులో ఫేస్‌బుక్‌లో ఒక ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. కోరా పేరుతో పరిచయం చేసుకున్న మహిళ.. తనది సింగపూర్ అని.. ప్రస్తుతం ముంబయిలో పనిచేస్తున్నట్లు చెప్పేది. ఇద్దరి మధ్య కొన్నిరోజులు చాటింగ్ జరిగాక ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. ప్రస్తుతం తన తల్లి.. సవతి తండ్రితో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నట్లు కోరా చెప్పేది. తనకు జర్మనీ సహా దేశవిదేశాల్లో స్నేహితులున్నారంటూ ఫేస్‌బుక్ గ్రూపులో వీరభద్రరావును యాడ్ చేసింది.తమ స్నేహితులంతా ఫేస్‌బుక్ స్టోర్‌లో పెట్టుబడులు పెడుతూ భారీగా లాభాలు సంపాదించారని.. డబ్బుంటే ట్రేడింగ్ చేయాలని సలహానిచ్చింది. తొలుత నిరాకరించిన వీరభద్రరావు.. ఆ తర్వాత అంగీకరించడంతో కోరా ఫేస్‌బుక్ స్టోర్ పేరుతో ఒక లింకు పంపింది. అది ఓపెన్ కాకపోవడంతో ఏపీకే ఫైల్‌ను పంపింది. దీన్ని డౌన్‌లోడ్ చేయగానే అచ్చం ఫేస్‌బుక్ తరహా యాప్ వీరభద్రరావు ఫోన్‌లో ప్రత్యక్షమైంది. అందులోని స్టోర్‌లో వస్తువులు కొంటూ విక్రయిస్తూ లాభాలు గడించాలని చెప్పింది. సలహాల కోసం జర్మనీ స్నేహితురాలు బెల్లాతో మాట్లాడాలని ఆమె ఫోన్‌నంబర్ ఇచ్చింది. బెల్లా చెప్పినట్లు చేస్తూ పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాడు. సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 12 మధ్య క్రిప్టో వ్యాలెట్ ద్వారా మొత్తం రూ.2.36 కోట్లు పంపించాడు. ఈ యాప్‌లో లాభాలు వచ్చినట్లు చూపించినా డబ్బు విత్‌డ్రా అవకాశం ఇవ్వలేదు. కొన్ని నెలలపాటు పదేపదే అడిగినా లాభం, అసలు రెండూ ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన వీరభద్రరావు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

# నీటి సంరక్షణకు

## 100 రోజుల యాక్షన్ ప్లాన్: సీఎం చంద్రబాబు




అమరావతి: నీటి సంరక్షణ - జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టనుంది. సోమవారం తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో జరిగే కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో యాక్షన్ ప్లాన్‌పై రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో చంద్రబాబు ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

నీటి పారుదల, అటవీ, పంచాయతీరాజ్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల సమన్వయంతో 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమం చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు పనుల గుర్తింపు కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలని, ఏప్రిల్ 21 నుంచి జులై 9వ తేదీ వరకు పనులను చేపట్టాలని ఆదేశించారు. జులై 10 నుంచి 14 వరకు.. పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సూచించారు. సాగునీటి సంఘాలే కేంద్రీకృతంగా ఈ కార్యక్రమాలు అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులకు కీలక బాధ్యతలు అప్పగించారు.

వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఫీడర్ ఛానెళ్లను క్లియర్ చేయడం సహా.. పూడికతీత పనులు చేపట్టాలన్నారు. గుర్రపు డెక్క తొలగించాలని.. చెరువులు, కాల్వలను క్లియర్ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అవసరమైన మేరకు చెక్ డ్యామ్‌లను రిపేర్లు చేయాలని.. కొత్త స్ట్రక్చర్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి సంఘాలు వాటర్ బడ్జెట్ తయారు చేసుకోవాలని సూచించారు. ప్రజాచైతన్యం, ప్రజల భాగస్వామ్యంతో 100 రోజుల ఉద్యమాన్ని సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# రాజధానికి భూములిచ్చిన రైతులను అవమానిస్తారా?:

మొదటిపేజీ తరువాయి

అమరావతి: రాజధానిపై ఏం మాట్లాడుతున్నారో వైకాపా అధినేత జగన్‌కు కనీసం అర్థమవుతుందా? అని మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు. సీఎం చంద్రబాబుపై ప్రజలకు అపార నమ్మకం ఉందన్నారు. ఆ నమ్మకంతోనే రైతులు రాజధానికి స్వచ్ఛందంగా భూమిలిచ్చారని పేర్కొన్నారు.

"రాజధానికి భూములిచ్చిన రైతులను అవమానిస్తారా..?. రాబోయే రోజుల్లో వైకాపాకు ప్రజలు పుట్టగతులు లేకుండా చేస్తారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తాన్ని అమరావతికి ఖర్చు పెడుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు" అని మంత్రి మండిపడ్డారు.

# అమరావతిపై కడుపు

## మంటతోనే జగన్ కొత్త నాటకం

మొదటిపేజీ తరువాయి

**గత వైకాపా ప్రభుత్వం సీఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు మళ్ళీ రాజధానిపై మాట్లాడటం విడ్డూరమన్నారు.**

**సీఆర్‌డీఏ మ్యాప్‌ను గమనిస్తే చంద్రబాబు నాయుడు గారి అభివృద్ధి విజన్ ఏంటో అర్థమవుతుందని, అమరావతిపై ఉన్న అసూయతోనే జగన్ ఇలాంటి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.**

అమరావతి: అమరావతితో పాటు సీఆర్‌డీఏ పరిధి మొత్తం అభివృద్ధి జరుగుతుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. జగన్ 3 ముక్కలాట నాటకం అయిపోయిందని.. మావిగన్ మొదలైందని ఎద్దేవా చేశారు. స్పష్టంగా జీవో ఇచ్చినా.. సరిగా చూడకుండా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. సీఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నం చేశారా.. లేదా? అని నిలదీశారు.

వైకాపా హయాంలో ఏపీసీఆర్‌డీఏ అక్కర్లేదని జగన్ బిల్లు ఎందుకు పెట్టారన్నారు. "జగన్ ఎన్ని నాటకాలాడినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు. అమరావతిపై ఉన్న కడుపు మంటతోనే కొత్త నాటకం ఆడుతున్నారు. కొత్త పేర్లు తీసుకొచ్చిన జగన్‌ను చూసి.. ప్రజలు నవ్వుకుంటున్నారు. సీఆర్‌డీఏ మ్యాప్ చూస్తే చంద్రబాబు విజన్ ఏంటో అర్థమవుతుంది" అని పట్టాభి అన్నారు.

అవినీతి, దోపిడీ జగన్‌కు రెండు కళ్లు: ప్రత్తిపాటి

అవినీతి, దోపిడీ జగన్‌కు రెండు కళ్లు అని తెదేపా నేత ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ ముఠా తీరు మారలేదని విమర్శించారు. రాజధానిపై జగన్ చిమ్మే ప్రతి విషపు బొట్టు.. ఆయన పతనానికే అన్నారు. అమరావతిని బలపరిస్తేనే ప్రజల్లో ఉంటారని వైకాపా గ్రహించాలన్నారు.

# నాదర్‌గుల్ భూములు.. రేవంత్

## అధికారంలోకి వచ్చాకే కబ్జాలు: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

"వైఎస్ డిక్లేర్ చేసిన ప్రభుత్వ భూములను కేసీఆర్ కాపాడితే.. రేవంత్‌రెడ్డి భక్షిస్తున్నారు. ఈ వివాదాస్పద భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది. మా ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు కూడా సమర్థించింది. ప్రస్తుతం భూభారతిలోనూ ప్రభుత్వ భూములుగానే చూపిస్తోంది. వీటిని కేసీఆర్ హయాంలో ఎవరూ కబ్జా చేయలేదు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే కబ్జాలు మొదలయ్యాయి.

నాదర్‌గుల్ భూములను కాపాడేందుకు హైడ్రా ఎందుకు రావట్లేదు? లింగమయ్య గుట్ట సహా దాదాపు 100 ఎకరాల్లో గుట్టలు ఉన్నాయి. 12 ఎకరాలు ఉన్న లింగమయ్య గుట్ట తప్ప మిగతా అన్నీ కాజేశారు. ఈ కుంభకోణంలో సీఎం రేవంత్‌రెడ్డి వాటా ఎంత? పొంగులేటి కుటుంబంపై అధికారులు చర్యలు తీసుకుంటారా? అసెంబ్లీలో వ్యాఖ్యలకు సీఎం కట్టుబడి ఉంటే చర్యలు తీసుకోవాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# దళితులంతా సంఘటితం కావాలి

- బిజేపీ పాలనలో దళితులపై పెరిగిన దాడులు
- కేసిఆర్ పాలనను తలపిస్తున్న కాంగ్రెస్ పరిపాలన
- నిధుల కేటాయింపులో చిన్నచూపు
- ఏజెన్సీ ప్రాంతాల్లో అనాదిగా అన్యాయం
- ఏప్రిల్ 17,18న జరిగే డిహెచ్పిఎస్ రాష్ట్ర 2వ మహాసభలను జయప్రదం చేయండి
- మారుపాక అనీల్, ఎస్కే సాబీర్ పాషా, నలిగటి

ప్రజలకు చేరువ

కొత్తగూడెం : తరాలుగా అణిచివేత, అంటరానితనం, వివక్షత, పోపిడీకి గురవుతున్న దళితులంతా సంఘటితమైన నాడే సమస్యలను అదిగమించే అవకాశం ఉంటుందని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనీల్ అన్నారు. సోమవారం సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్ డిహెచ్పీఎస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం పేరాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి విచ్చేన అనీల్ మాట్లాడుతూ అంటరాని తనం అనే అమానవీయ దురాచారానికి దళితులు తరతరాలుగా బలైపోతున్నారని, సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటున్నారని, దీనిని తప్పికొట్టేందుకు దళితులంతా ఏకం కావాలన్నారు. 76 ఏళ్ల స్వతంత్ర భారతంలో దళితులు అణిచివేతకు గరువుతున్నారు. దేశంలోని నరేంద్రమోడి పాలనలో దళితులపై దాడులు 400 రెట్లు పెరిగాయని, ఉత్తర భారతంలో దళితులపై జరుగుతున్న అగాయిత్యాలు వర్ణించతరం కాదన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, కూల నిర్మూలన కాగితాలకే పరిమితమైందన్నారు. డా.బి. ఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు పాలకుల విధానాల వల్ల అపహాస్యం పాలవుతున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు పాలకులు పాతరవేస్తూ ప్రైవేటీ కరణవైపు మొగ్గు చూపుతున్నారని, తద్వారా దళితులు ఉపాధి అవకాశాల్లో వెనుక్కు నెట్టబడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం వల్ల రిజర్వేషన్ సౌకర్యం ఉద్యోగ అవకాశాలు పొందే దళితులకు అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వం దేశంలో రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి కనీసం రెండు వేల ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా మాట్లాడుతూ రాజ్యాంగ బద్దంగా ఎన్నికైన ప్రభుత్వాలు దళితుల అభివృద్ధికి చట్టబద్దంగా కేటాయిచాల్సిన 20శాతం నిధులను ఏనాడూ కేటాయించలేదని, అరకొర కేటాయింపులు కూడా దళిత వర్గాల సంక్షేమానికి వినియోగించకుండా పాలకులు దారిమళ్లిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీల అభివృద్ధి కోసం కేటాయించాల్సిన నిధుల్లో గణనీయమైన తగ్గింపు, కోతలు విధింపుతో వివక్షత కొనసాగుతోందన్నారు. 2017-18లో ఎస్సీ సబ్ ప్లాన్ రద్దు చేయడం ద్వారా బిజేపీ ప్రభుత్వం దళితులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దేశంలో 58 శాతం మంది దళితులు భూములేని వారు ఉన్నారని, దళితులు సాగు చేసుకుంటున్న భూముల్లో 50 శాతానికి పైగా నీటి సదుపాయం లేదని, దళిత జనాభాలో 65 శాతం ఇంకా పేదరికంలోనే మగ్గుతున్నారని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతంలో తరాలుగా జీవనం సాగిస్తున్న దళితులు అన్ని రంగాల్లో వివక్షతకు గురవుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియలో కూడా




తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజనులతో పాటు జీవనం సాగుతున్న దళితుల పోడు భూములకు ప్రభుత్వం పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిహెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నలిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, నిధులు, నీళ్లు, నియామకాల పేరుతో అధికారంలోనికి వచ్చిన కేసిఆర్ ప్రభుత్వం ధరణి పేరుతో దళితులు భూములను లాక్కుందని, ఊరి చివరిన సాగుచేసుకునే దళితుల భూములను స్మశాన వాటికలు, పార్కులు, వనాల పేరుతో లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారం చేపట్టిన వెంటనే భూమిలేని నిరుపేద దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామని చెప్పి మాట తప్పారని, గత ప్రభుత్వం మాదిరిగానే ఈ కాంగ్రెస్ పాలన ఉందని, ఎన్నికల హామీలో భాగంగా దళితులకు చెవళ్ల డిక్లరేషన్లో ఇచ్చిన హామీలను రేవంత్ సర్కార్ నిలుపుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో దళితుల ఆర్థిక, రాజకీయ సమాజిక హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కొరకు, కుల వివక్షత నిర్మూలన కొరకు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు, పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని, ఇందు కోసం ఈ నెల 17,18 తేదీల్లో వరంగల్ వేదికగా జరిగే డిహెచ్పిఎస్ రాష్ట్ర 2వ మహాసభలను జయప్రథం చేయాలన్నారు. అనంతరం మేయర్ మూడ్ గణేష్తో పాటు దళిత సామాజిక వర్గానికి చెందిన నూతన కార్పోరేటర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె రత్నకుమారి, మోహన్ రావు, పోలమూరి ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## వికసిత జిల్లాగా అభివృద్ధికి చర్యలు తీసుకోండి

- 20 సూత్రాల ఆమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్



చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ

వికసిత మార్కాపురం జిల్లాగా తయారు చేయడానికి చర్యలు తీసుకోవాలని 20 సూత్రాల ఆమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశశీ హాల్ లో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ విద్య వైద్యం, అమృత్, జలజీవన మిషన్ పి.యం సూర్యఘర్, పీఎం కుసుమ్, వెలుగొండ ప్రాజెక్ట్ తదితర అంశాలపై అధికారు లతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర కార్యక్రమం లో భాగంగా వికసిత మార్కాపురం జిల్లాగా తయారు చేయడానికి అందరు సహకరించాలని ఆయన చెప్పారు. ప్రధానంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు మార్కాపురం జిల్లా ప్రకటించారని అందు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మార్కాపురం ప్రజల జీవనాడి వెలుగొండ ప్రాజెక్టు అని వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలో అన్ని సమస్యలు పరిష్కా రం అవుతాయని చెప్పారు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి కావడా నికి ఎలాంటి సమస్య లు ఉన్నాయని ఎంత నిధులు అవసరమని అనే విషయాలను పూర్తిగా అధికారు లను అడిగి తెలుసు కున్నారు. జిల్లాలో జలజీవన్ మిషన్ క్రింద చేపట్టిన పనులన్నీ కూడా పూర్తి చేయాలని పనులు ఏశీత మేర పూర్తి చేశారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన వైద్య సౌకర్యాలు అందించాలని విద్యాశాఖ, ఆరోగ్య శాఖ అధికారులకు ఆయన చెప్పారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ఎస్సీ ఎస్టీ గ్రామాలలో సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆ విద్యుత్ శాఖ అధికారులకు చెప్పారు. మార్కాపురం జిల్లాలో చెన్నకేశవస్వామి దేవాలయం, రాచర్ల మండలం నెమలి గండ్లరంగనాథ స్వామి దేవాలయం, కాకర్ల త్యాగరాజు స్వామి దేవాల యాలను, కంభం చెరువును పర్యాటక ప్రాంతాలుగా అభి వృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, వెలిగొండ ప్రాజెక్టు ఎస్.సి అబూత్ అలీ, గ్రామీణనీటి సరఫరా శాఖ ఇ. ఇ సురేష్ బాబు, సి పి డి సి ఎల్ ఎస్.సి కట్టా వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## జెండా ఆవిష్కరించిన బిజెపి నాయకులు



చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ

భారతీయ జనతా పార్టీ 47వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కనిగిరి టౌన్ అధ్యక్షులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతరత్న మాజీ ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారి వాజ్పేయి యొక్క స్ఫూర్తితో భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని దేశ అభివృద్ధిలో బిజెపి కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు.దేశ రక్షణే ధ్యేయంగా స్థాపితమై ప్రపంచంలోని అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి వద్దిపాటి వెంకటేష్, సీనియర్ నాయకులు ముక్కువెంకటరెడ్డి , తిప్పలూరి శ్రీనివాసులు, మస్తానయ్య, బీజేవైఎం ఉపాధ్యక్షులు నవీన్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బారావు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవులు, వేణు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరిలో పిడుగుపాటుకు బీహార్ యువకుడు మృతి

కనిగిరి : ప్రజలకి చేరువ



కనిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో కురిసిన భారీ వర్షం బీహార్కు చెందిన దుర్గేష్ కుమార్ (24) అనే యువకుడిని పొట్టనబెట్టుకుంది. రైల్వే స్టేషన్లో టైల్స్ పనులు చేసేందుకు వచ్చిన దుర్గేష్ కుమార్, సాయంత్రం కురిసిన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో తోటి కార్మికులు భయాందోళనకు గురయ్యారు. కళ్ల ముందే స్నేహితుడు విగతజీవిగా పడి ఉండటం చూసి వారు కన్నీరుమున్నీరు అవుతున్నారు. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.?సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. బతుకుదెరువు కోసం వచ్చిన యువకుడు ఇలా అర్థాంతరంగా తనువు చాలించడం అందరినీ కలచివేస్తోంది.ప్రస్తుతం అధికారులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించే ప్రయత్నంలో ఉన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న సారపాక సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్....

ప్రజలకు చేరువ




12 రోజులుగా సారపాక గ్రామంలో ఐటిసి కర్మాగారంలో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్ట్ కార్మికులు 13వ వేతనం ఒప్పందంలో పెండింగ్ అంశాలు పైన, జరుగనున్న 14వ వేతన ఒప్పందంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతన ఒప్పందం అన్ని యూనియన్లు కలిసి జేఏసీ గా ఏర్పడిన నేపథ్యంలో గుర్తింపు సంఘం తో సంబంధం లేకుండా జేఏ సీతోనే అగ్రిమెంటు చేయాలని డిమాండ్ తో గేటు ముందు ఐటీసీ కర్మాగారంలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులు, జేసీ నేతలు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న నేపథ్యంలో వారి న్యాయమైన కోరికలు తీర్చాలని వారికి మద్దతును తెలియజేసిన సారపాక సర్పంచ్ గుగులోతు కిషోర్ శివరాం నాయక్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంటాక్ట్ కార్మికులు ఎంతో కష్టపడితేనే కర్మాగారం అంచలంచలుగా అభివృద్ధి చెందిందని అభివృద్ధికి మూలం కాంటాక్ట్ కార్మికులేనని వారి న్యాయమైన కోరికలు తీర్చడంలో ఐటిసి యాజమాన్యం చొరవ చూపించాలని ఎప్పటికే యాజమాన్యం కి పలుమార్లు నివేదికలు చేసిన వారు ఇప్పటివరకు స్పందించకపోవడం సమంజసం కాదని అన్నారు. కాంటాక్ట్ కార్మికులు చేస్తున్న దీక్షలు న్యాయమైనవని అని వారికోసం ఏం చేయడానికైనా ఎంతవరకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాంటాక్ట్ కార్మిక నేతలు పలుమార్లు నివేదనలు సమర్పించడం జరిగిందని, ఇప్పటివరకు కూడా తమతో చర్చించటానికి వారు సుముకుత చూపించలేదని రాబోయే రోజుల్లో ఇలాగే కొనసాగితే ఆమరణ నిరాహార దీక్షలు చేయటానికి అవసరమైతే సమయపాటి పట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు జేసీ నేతలు తెలియజేస్తున్నారు. ఎన్ని సంవత్సరాలుగా ప్రతి వేతన ఒప్పందంలో వారికి అన్యాయం జరుగుతుందని ఇక అలా జరగడానికి లేదని ఈసారి జెఎసి నేతలతోనే వారి అగ్రిమెంట్ చేయాలని వారు డిమాండ్ చేస్తూ ఉన్నారు. దాంతోపాటు గతంలో 13వ వేతనం ఒప్పందంలో పెండింగ్ అంశాలు వెంటనే అమలు చేయాలని న్యాయమైన కోరికలు తీర్చాలని కార్మికులు కోరుతున్నారు.

## ఏఐటీయుసి మహాసభల కరపత్రం విడుదల

చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ



భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అనుభంద సంఘం ఏఐయుటిసి జిల్లా మహాసభలు ఈనెల 8 తేదీన జరగనున్నాయి సి ఎస్ పురం మండల ఏఐటీయు సి నాయకులు ఎస్ కె వై మౌలాలి మండలంలో ఏఐయూటిసి సభ్యులతో క్రపత్రం విడుదల కార్యక్రమం సోమవారం జరిగింది ఈ సందర్భంగా మౌలాలి మాట్లాడుతూ కార్మికుల హక్కులకొరకు ఏఐటీయుసి నేటికి 100 సంవత్సరాలు అలుపెరగని పోరాటాలు నడిపి కార్మకుల కొరకు ఎంతో మంది ప్రాణాలర్పించారని, ఆ ఫలితమే కార్మికులకు చట్టాలు చేసారని ఈ సదర్భంగా గుర్తు చేసారు నేటికి ఏఐయుటిసి ఎర్పడి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా కనిగిరిలో ఈనెల 8 తేదీన జరగు జిల్లా మహాసభలకు మండలంలో అన్ని కార్మిక సంఘాల సభ్యులు ఆధిక సంఖ్యలో పాల్గని జిల్లా మహసభను విజయవంతంచేయాలని మండల ఏఐటీయుసి నాయుకులు ఎస్ కె వై మౌలాలి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయుకులు ఆర్ గురవయ్య ఆటో సంఘం నాయుకులు వై మోషయ్య సంఘం నాయుకులు పెయింటు కార్మిక సంఘం నాయకులు ఎస్ కె ముస్తాపా తదితరులు పాల్గొనారు

## నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.2,06,369/- లు

చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.2,06,369/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా ఆదాయం రూ. 53,990/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా ఆదాయం రూ.22,640/- లు, అన్నదానం విరాళంల ద్వారా ఆదాయం రూ,37,127/- లు , ఇతర విరాళముల ద్వారా ఆదాయం రూ.92,612 /- లు వచ్చినట్లు తెలిపారు

## ఏలూరు రోడ్లపై వరదనీరు

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

ఏలూరుపట్టణంలో ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది.వర్షపు నీరంతా రోడ్లపై పారింది.రోడ్లన్నీ వరద నీటితో మునిగిపోయి చెరువులను తలపించాయి.రోజువారి పనులకు వెళ్లేవారు, విద్యార్థులు, ఉద్యోగులు పలు ఇబ్బందులు పడ్డారు.ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రులో వర్షపు నీరు నిలిచిపోవడంతో రోగులు,ఆసుపత్రి సిబ్బంది పలు ఇబ్బందులు పడ్డారు.అదేవిధంగా ఏలూరు రిజిస్టర్ ఆఫీస్, ప్రభుత్వ ఆసుపత్రిలో వర్షానికి,ఈదురుగాలులకు చెట్టు కుప్పకూలింది.







# కోట వినుత వ్యాఖ్యలపై టీడీపీ నేతల ఘాటు హెచ్చరిక

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పై జనసేన బహిష్కృత నేత కోట వినుత చేసిన వ్యక్తిగత విమర్శలను తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్ మాట్లాడుతూ, రాజకీయ విమర్శలు పరిమితుల్లో ఉండాలని, వ్యక్తిగత స్థాయికి దిగజారడం తగదని పేర్కొన్నారు.వైసీపీ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఎమ్మెల్యేగా గెలిచిన సుధీర్ రెడ్డి, నియోజకవర్గంలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీ కార్యకర్తలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వంలో ప్రజాపాలన నిబంధనల ప్రకారం సాగుతుందని, సుధీర్ రెడ్డి ఎప్పుడూ అధికారులను ప్రభావితం చేయరని స్పష్టం చేశారు. కోట వినుత చేసిన ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు.గిరిజన సలహా మండలి సభ్యులు యం.



సుబ్బయ్య మాట్లాడుతూ, 2023 సెప్టెంబర్ 17న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టీడీపీ–జనసేన పొత్తును ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అంతకుముందు రెండు పార్టీల కార్యకలాపాలు వేర్వేరుగా ఉన్నాయని, ఆ కాలంలో వినుత చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు దూరమని అన్నారు.
టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు మాట్లాడుతూ, టీడీపీ లేదా బొజ్జల కుటుంబం అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకుంటే వాటిని ఎమ్మెల్యేకు ఆపాదించడం సరికాదన్నారు.నాయి బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ మాట్లాడుతూ, టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయం బలంగా కొనసాగుతోందని చెప్పారు. జనసేనకు సంబంధం లేని వినుత అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు.తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి మాట్లాడుతూ, గత ఎన్నికల్లో సుధీర్ రెడ్డి గెలుపుకు జనసేన కార్యకర్తలు కూడా కృషి చేశారని తెలిపారు. అయితే వినుత తిరుపతిలో ప్రచారం చేసి, శ్రీకాళహస్తిలో క్రెడిట్ తీసుకోవడం సరికాదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, యం. సుబ్బయ్య, డా. ఉమేష్ రావు, వజ్రం కిషోర్, చిల్లకూరు మణి, కోట చంద్రశేఖర్, గంగనపల్లి రమేష్, సులేమాన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకాళహస్తిలో 'నీటి భద్రత'

# కార్యక్రమానికి శ్రీకారం



రైతాంగ సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలవనరుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన "నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి మండలంలోని సురవారి పల్లె గ్రామంలో సోమవారం ఘనంగా ప్రారంభించారు.రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా తాడిపత్రిలో ప్రారంభించగా, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో భాను ప్రకాష్, ఇరిగేషన్ శాఖాధికారులు పాల్గొని స్థానికంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఏప్రిల్ 6 నుంచి జూలై 14, 2026 వరకు 100 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమం ద్వారా చెరువుల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, భూగర్భ జల మట్టాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. గ్రామస్థాయిలో నీటి వనరుల పరిరక్షణకు చర్యలు చేపట్టి, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది.రైతులకు అన్ని విధాలా మద్దతు అందిస్తూ ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

# మొక్కజొన్న కల్లాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

**– ప్రభుత్వాన్ని విమర్శించిన తెల్లం బాలరాజు**

రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకీ దారుణంగా మారిపోతుందని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు గిట్టుబాటు ధర అనే మాటే మాయం అయిందని తీవ్రంగా విమర్శించారు."రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసి, ప్రజల భవిష్యత్తును పణంగా పెట్టి, రైతులను నష్టాల్లో నెట్టేసే పాలన ఇది" అంటూ మండిపడ్డారు. వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, రైతుల కష్టాలను పట్టించుకోకుండా, కేవలం మాటలతో మభ్యపెడుతున్నారని అన్నారు.రైతు భరోసా కేంద్రాలు ఉన్నా ఉపయోగం లేకుండా పోయాయని, రైతులకు అందాల్సిన మద్దతు ఎక్కడా కనిపించడం లేదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మొక్కజొన్న రైతులకు కనీసం రూ.3000 మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. రైతు కష్టానికి తగిన ధర ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు…"పొద్దున్న లేస్తే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరు జపించడం తప్ప రైతుల బాధలు వినే సమయం కూడా ఈ ప్రభుత్వానికి లేదు" అంటూ ఎద్దేవా చేశారు…"రైతు చెమటను



గౌరవించని పాలన ఎక్కువ రోజులు నిలవదని రైతు వ్యతిరేక ప్రభుత్వానికి ప్రజలే గట్టి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి!" అంటూ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు..

# మొక్కజొన్న రైతు విలవిల



పోలవరం మండలంలో తుఫాను ప్రభావంతో సోమవారం ఉదయం కారుమబ్బులతో కూడిన చిరుజల్లులు కురుస్తున్నాయి. ఇప్పటికే మొక్కజొన్న పంటకు సరైన ధరలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, ఈ వర్షాలతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.గత ఏడాది మొక్కజొన్న క్వింటా ధర సుమారు రూ.2200 వరకు ఉండగా, ఈ ఏడాది దళారులు కేవలం రూ.1800కే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేయకపోవడం వల్ల మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కోట వినుతకు టీడీపీ నేతల హెచ్చరిక

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిపై జనసేనకు చెందిన బహిష్కృత నేత కోట వినుత చేసిన ఆరోపణలు, అసభ్యకర వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. పోలీసులపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు.సోమవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కోట వినుతను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే పార్టీ నుంచి బహిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆమెకు పార్టీతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.అనుమతులు లేని అక్రమ నిర్మాణాన్ని



మున్సిపల్ అధికారులు చట్టబద్ధంగా కూల్చివేశారని, ఇందులో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.ఇకముందు ఎమ్మెల్యేపై అసభ్యకర వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు చేస్తే తగిన విధంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. ఇతరులపై ఆరోపణలు చేసే ముందు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ ఘటనపై కోట వినుత, కోట చంద్రబాబు నాయుడు పై శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.సమావేశంలో పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, కాసరం రమేష్, నాగమల్లి దుర్గాప్రసాద్, వినయ్, ఆలయ బోర్డు సభ్యుడు జి. గోపీనాథ్, బుజ్జి, షైక్ బషీర్, సుమతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాల పాత్ర కీలకం మునిరాజు నాయుడు



నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత అని తెలుగుదేశం పార్టీ టిడిపి మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు అన్నారు, సోమవారం లింగమనాయుడు పల్లి హైస్కూల్ ప్రాంగణంలో నీటి భద్రత సాగు నీటి సంఘాల భాధ్యత కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నీటి వనరుల వినియోగం,భూగర్భ జలాల పెంపొందించే దిశగా గ్రామ ప్రజల సూచనల మేరకు లింగమ నాయుడుపల్లి చెరువు కట్టపై ముళ్ల పొదలను తొలగింపు ,నీటి వనరుల పెంపొందించుటకు సంబంధించిన పంట కాలువలు,పలు రకాల పనులను గుర్తించారు.నీటి వనరుల వినియోగంపై మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావిళ్ళ.మునిరాజ నాయుడు,మండలాభివృద్ధి అధికారి సురేంద్రనాద్ గ్రామ సభలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆయకట్టు వైస్ ప్రసిడెంట్ శంకర్ నాయుడు,ఇరిగేషన్ డీ.ఇ ప్రకాష్ రావు,ఎఇ ముని మోహన్,స్వర్ణ గ్రామ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా బి.జె.పి. స్థాపన దినోత్సవ వేడుకలు

కుక్కునూరు మండల కేద్రం లో గల బి జె పి పార్టీ కార్యాలయంలో సోమవారం బిజెపి 46 వ స్థాపన దినోత్సవ వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు కే వి ఎన్ దొర జెండా ఆవిష్కరణ చేశారు. బిజెపి ధార్మిక సెల్ జిల్లా కో కన్వీనర్ వాడపల్లి లక్ష్మణాచార్యులు మాట్లాడుతూ బిజెపి పార్టీ 1980 ఏప్రియల్ 06 న అటల్ బీహార్ వాజపేయి ఆధ్వర్యంలో ప్రారంభించబడింది.నాటి నుండి నేటి వరకు పార్టీ భారతదేశ అభివృద్ధి కోసం పని చేస్తున్నదని తెలియజేశారు. పార్టీ మాజీ మండల అధ్యక్షులు,ప్రస్తుత జిల్లా నాయకులు తూము వెంకన్న మాట్లాడుతూ బిజెపి పార్టీ స్థాపించిన నాటి నుండి దేశానికీ,పార్టీకి విశేషసేవలందించిన నాయకులు, కార్యకర్తలను కొనియాడారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు స్వీట్స్ పంచి పార్టీ ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. ప్రతీ కార్యకర్త, నాయకుడు పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని తీర్మానించుకున్నారు. ఈ కార్యాక్రమం లో సీనియర్ నాయకులు గుత్తా లక్ష్మణ రావు, బిక్కసాని బుచ్చయ్య చౌదరి, పొక్కుల నాగేశ్వరావు, మండల నాయకులు విఘ్నేశ్వరరావు, ఎస్ టి సెల్ మండల అధ్యక్షులు బిట్టా అప్పారావు, మండల కార్యదర్శులు వేముల శేషగిరి యాదవ్, బాల




మణికంఠ కార్యకర్తలు తంగేళ్లపల్లి నాగేశ్వరావు, మాదాబత్తుల మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తికి జంగా కృష్ణమూర్తి



ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనార్థం టీటీడీ ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు జంగా కృష్ణమూర్తి సోమవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు బీజేపీ నాయకుడు లోకేష్ యాదవ్, ఆలయ అధికారులు స్వాగతం పలికి అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు.
దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేసి, తీర్థప్రసాదాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏపీఆర్ఓ రవి పాల్గొన్నారు.

## వేద పండితుల ఆధ్వర్యంలో మృత్యుంజయ స్వామికి అభిషేకాలు



ప్రముఖ పుణ్యక్షేత్రమైన దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుని ఆలయ ఆవరణంలో గల మృత్యుంజయ స్వామికి సోమవారం పురస్కరించుకొని వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకం శాస్రోక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్వామివారిని వీభూది, కుంకుమ, గంధము, నారికేల, జలము,తేనే, పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం స్వామి వారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు.స్వామి వారు అత్యంత ఆకర్షితుడై భక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# అకాల వర్షం... రైతన్నల ఆర్తనాదం



ఏలూరు జిల్లాలో సోమవారం పలుచోట్ల కురిసిన అకాల వర్షాలకు మామిడి, మిరప, మొక్కజొన్న రైతులు విలవిల్లాడుతున్నారు.కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్న పంటలను కాపాడుకోవడానికి రైతులు నానాతంటాలు పడ్డారు.ఈ ఏడాది విరివిగా మామిడి పూత పూసినప్పటికీ,పిందెలు సమయంలో వచ్చిన ఈదురుగాలులు తాకిడికి పిందెలన్నీ నేలరాలాయి.దీంతో చెట్లకు అక్కడక్కడా ఉన్న మామిడికాయలన్నీ సోమవారం కురిసిన అకాల వర్షానికి కాలాన్నీ నేలపాలయ్యాయి.మామిడికాయలు రాలపడటంతో సష్టపోయామని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. వర్షంతో పాటు వచ్చిన ఈదురుగాలులకు కొంతమంది ఇళ్లపై రేకులు,టార్పాళ్లు ఎగిరిపోయాయి. గాలి వానతో పాటు ఉరుములు, మెరుపులు రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గంటపాటు కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది.